కామెడీ కథ

అవధాని

# హమ్మ మొబైలా

ఆ వేళ నగరంలో ఎన్ని పెళ్ళిళ్ళో! మంచి ముహూర్తం కావడం వల్లనూ, అంతకుముందే మూఢం వెళ్ళడం వల్లనూనేమో ఆ ముహూర్తానికి చాలా పెళ్ళిళ్ళౌతున్నాయి. కళ్యాణ మండపాలకి గిరాకీ, పురోహితులకీ గిరాకీ, పెళ్ళి మండపం కట్టేవాళ్ళకి గిరాకీ, కేటరింగువాళ్ళకి గిరాకీ, పూలకి గిరాకీ, అన్నింటికీ గిరాకీయే. అంతదాకా ఎందుకూ..నా మటుకు నాకే అదే ముహూర్తానికి నాలుగు శుభలేఖలొచ్చేయి.

ఒకటెలాగోలాగ తప్పించుకున్నా మిగిలిన మూడూ మరీ తప్పించుకోలేని బంధువులదీ, స్నేహితులవీను.ఏం చెయ్యను? సరే, ఒక చోటికి ముహూర్తానికి ముందే వెళ్ళి అటెండెన్స్ వేయించుకుని, అక్కడే బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని, అక్కడి నుంచి రెండో చోటకెళ్ళి సుముహూర్తం దాకా కూర్చుని, అక్షింతలు వేసి, అక్కడ్నించి మూడో చోటకెళ్ళి సూత్రధారణ చూసి, భోం చేసి రావడానికి ప్రణాళిక వేసుకున్నాను.

జీలకర్ర, బెల్లం పెట్టే సుముహూర్తం తరువాత పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ మధుపర్కాలు కట్టుకుని వచ్చి, మంగళ సూత్రధారణ జరిగేటప్పటికి సమయం పడుతుంది కదా. ఆ సమయంలో మూడో పెళ్ళికి అందుకోవచ్చని నా అభిప్రాయం. మనలో మన మాట- ఈ వీడియోల ప్రభావమేమో మరి, ఈ మధ్య పెళ్ళికూతుళ్ళు సుముహూర్తం మేకప్ వేరేగా, మంగళసూత్రధారణ సమయానికి మేకప్ వేరేగా, వస్త్రధారణ, శిరోజాలంకరణలతో సహా మార్చుకొంస్తున్నారు. మరి దానికి సమయం పడుతుంది కదా- ఆ సమయాన్ని మూడో పెళ్ళికి వెళ్ళడానికి ప్లాన్ చేసుకున్నాను.

పొద్దున్నే ఎనిమిది గంటలకల్లా అనుకున్నట్టుగానే మొదటి పెళ్ళికి వెళ్ళి అటెండెన్స్ వేయించుకుని, బ్రేక్‌ఫాస్ట్ కానిచ్చి రెండో పెళ్ళి మండపానికి వచ్చాను. మొదటి పెళ్ళి వారికన్నా వీళ్ళు కొంచెం హైక్లాసు వాళ్ళు. మామూలు మధ్యతరగతి వాళ్ళే ఈ రోజుల్లో పెళ్ళిళ్ళకి లక్షలు ఖర్చుపెడుతుంటే, మరి వీళ్ళకేం లోటు? ఆవరణంతా వాహనాలతో నిండిపోయింది. నా చిన్న స్కూటరు పెట్టే స్థలం కూడా కనపడక రోడ్డు మీదున్న కిళ్ళీకొట్టు పక్కన పెట్టి వాడికి జాగ్రత్తలు చెప్పి లోపలికెళ్ళాను.

రెండువైపుల తల్లిదండ్రులూ పెద్దహోదాల్లో వున్నవాళ్ళు. పిల్లలు కూడా బాగా చదువుకుని ఈ హైటెక్ రోజులకి తగ్గ వుద్యోగాలు చేస్తున్నవాళ్ళు. శుభలేఖ యివ్వడానికి యింటికొచ్చినప్పుడు పెళ్ళికొడుకు తండ్రి అన్నమాటలు గుర్తొచ్చేయి. "ఏం రోజులండి గురువుగారూ యివి! వుద్యోగ భద్రత అంటూ ఏమీ అఖ్ఖర్లేదు. అంతా అనుభవించెయ్యడమే అంటాడు మా వాడు. వాడు మొదట చేరిన కంపెనీలోనే నేను రిటైరయ్యే టైముకి వచ్చినదానికన్నా రెట్టింపొచ్చేది జీతం. ఆ తరవాత వాడు మూడు కంపెనీలు మారేడు. అటువంటిదిప్పుడు వాణ్ణి పట్టుకోగలమా?"

నిజమేకదా అనిపించింది.

అమ్మాయి కూడా యించుమించు అన్ని అర్హతలూ వున్న పిల్లేనట. యింకేం? మరింక వాళ్ళిద్దరూ పెళ్ళి పీటల మీద కూర్చుంటారో లేక ఆకాశానికి వేసే నిచ్చెన మీదుంటారో అనుకుంటూ లోపలి కడుగుపెట్టాను.

ఏమాట కామాటే చెప్పాలి. ఇద్దరూ పీటల మీదే వున్నారు. మధ్యలో తెర. సుముహూర్తానికింకా సమయముందనుకుంటాను. హాలు కిటకిట లాడిపోతోంది. ముందు నుంచి చివరిదాకా సీటుకోసం చూస్తే పెళ్ళికొడుకు బంధువుల్లో ఒకరు నన్ను గుర్తుపట్టి తీసికెళ్ళి మండపం పక్కన అతను కూర్చున్న కుర్చీని ఖాళీ చేసి నాకిచ్చి అతను అదృశ్యమైపోయేడు. ఒకసారి నాలుగువైపులా చూసి దృష్టి పెళ్ళిమండపం వైపు తిప్పాను.


అద్భుతంగా అలంకరించారు పెళ్ళిమండపాన్ని. రంగు రంగుల పువ్వులతో ఏ రంగుకారంగు ప్రాధాన్యతనే ఎక్కువన్నట్టు చూపిస్తూ ఎంతో కళాత్మకంగా వున్న పెళ్ళి మండపాన్ని చూసి మెచ్చుకోకుండా వుండలేకపోయాను. మండపంలో పెళ్ళికొడుకు పెళ్ళికూతురు మధ్యలో తెర, దాని మీద అందంగా తెరతీయగానే- సుమ దరహాస సుమ వర్షం అని వుంది. అవును, గుర్తొచ్చింది, పెళ్ళికూతురు పేరు సుమ కదా అనుకున్నాను. దృష్టి పెళ్ళి పీటల వైపు మళ్ళించాను.

పెళ్ళికూతురు బంగారు మలామా వేసినట్టు మెరిసిపోతోంది. పెళ్ళికొడుకేమీ తక్కువగా లేడు.

ఎవరో డిజైనర్ చక్కగా డిజైన్ చేసిన పంచెలాంటి పైజమా, మెడకీ, భుజాలకీ, చేతులకీ భారీగా జరీ ఎంబ్రాయిడరీ చెయ్యబడిన కుర్తా, ఆ జరీని కప్పేస్తూ మెడలో బంగారు గొలుసొకటీ, ముత్యాల హారమొకటీ, పగడాల దండొకటీ వేసుకున్నాడు. ఎవరు మేకప్ చేసేరోకానీ మొహాన కళ్యాణం బొట్టు కూడా అందంగా దిద్దారు. కాని..కాని అదేమిటి? ఆ పెళ్ళికొడుకు మెడలా వంగిపోయిందేమిటి? నాకు తెలిసినంతవరకు ఆ కుర్రాడు స్ఫురద్రూపేనే..నా మెడని కాస్త ముందుకి వచ్చి చూసేను. ఆ ...అదీ సంగతి..అది మెడ వంగడం కాదు. ఆ పిల్లాడు మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మెడకీ, భుజానికీ మధ్యలో నొక్కిపెట్టిన మొబైల్‌లో మాట్లాడుతూ, ఎడం చెయ్యి పైకెత్తి వచ్చిన వారిని విష్ చేస్తూ, కుడిచేత్తో తన ముందున్న దేవుడికి పూజ చేస్తున్నాడు. ఆ సమయంలో అతను చేస్తున్న అష్టావధానానికి తెల్లబోయేను. అతను పురోహితుడు చెప్పే మంత్రాలు వింటూ పూజ చేస్తున్నాడో లేకపోతే మొబైల్ ఫోన్‌లో మాటలు వింటూ చెయ్యాడిస్తున్నాడో నాకర్థం కాలేదు.

చూపు పెళ్ళికూతురి వైపుతిప్పాను. ఆమె లోపలే గౌరీ పూజ ముగించుకుని వచ్చిందనుకుంటాను. ఇంకా యిక్కడామెకి పురోహితుడు పూజ చెయ్యడానికేమీ చెప్పలేదనుకుంటాను. అందుకనామె అలవోకగా కుడిచేతిలోని రుమాలుతో మేకప్‌కి పట్టిన చెమటని సుతారంగా అద్దుకుంటూ, ఎడం చేత్తో మొబైల్‌ఫోన్ చెవి దగ్గరగా పెట్టుకుని మాట్లాడుతోంది. ఆ కాసేపూ కూడా మొబైల్ ఫోన్లు వదలలేని వాళ్ళ హైటెక్ జీవితాలకి విస్తుపోకుండా వుండలేకపోయాను.

సుముహూర్తం సమీపిస్తోంది . పురోహితులు పెళ్ళికొడుకు, పెళ్ళికూతుళ్ళ యిద్దరి చేతులూ జీలకర్ర బెల్లం కలిపిన ముద్ద పెట్టడానికి ముందుకి తీసుకున్నారు. వాళ్ళచేతులు పురోహితులు తీసుకున్నా వాళ్ళుమాత్రం మొబైల్‌లో మాట్లాడుతూనే వున్నారు. "బాబూ, ఆ మాట్లాడ్డం కాస్త ఆపితే సుముహూర్తం జరిపిస్తాం.." ఒకాయన స్పష్టం చేసాడు.పెళ్ళికూతురు మొబైల్‌ఫోన్‌లో ఏదో చెప్పి సంభాషణ ముగించి మొబైల్ చేతిలో పట్టుకుంది. ఆమెని చూసి పెళ్ళికొడుకు కూడా అదే పని చేసాడు. అమ్మయ్య అనుకుని పురోహితులు మంత్రాలు చదవడం మొదలుపెట్టారు. మళ్ళీ కుయ్ కుయ్‌మంటూ ఏవేవో రాగాలతో మొబైల్స్ రెండూ మోగడం మొదలుపెట్టాయి. స్ప్రింగులాగా పెళ్ళికొడుకు మొబైల్‌ని మళ్ళీ మెడకీ భుజానికీ మధ్యలో అతికించేసుకున్నాడు. పెళ్ళికూతురి ఎడమ అరిచేయి మొబైల్‌తో సహా ఎడమ చెవికి అతుక్కుపోయింది. పురోహితులు మంత్రాలు చదవడం ఆపేసి వీళ్ళకోసం నిరీక్షించడం మొదలుపెట్టేరు. ఎక్కువ టైమేమీ తీసుకోకుండా పాపం రెండు నిమిషాల్లోనే వధూవరులిద్దరూ మాట్లాడ్డం ముగించి మళ్ళీ సుముహూర్తం ఫోజ్ కొచ్చే



సేరు.

మళ్ళీ పురోహితులు మంత్రాలు మొదలుపెట్టేరు. మళ్ళీ మొబైల్స్ మోగేయి. మళ్ళీ అంతరాయం. నాకు చిరాకనిపించింది. నాకే యిలావుంటే మరింక ఆ పెళ్ళి జరిపించే పురోహితులకెలా వుంటుందో! ఆ కాసేపూ మొబైల్ ఆఫ్ చెయ్యొచ్చుకదా! వాళ్ళకి ప్రతి నిమిషం విలువైనదే స్వంత పెళ్ళికన్నా కూడా. పురోహితులకి పాపం ఏం చెయ్యాలో తెలీట్లేదు. గట్టిగా ఏమీ అనలేరు. అలాగని వాళ్ళు చెయ్యవలసిన పద్ధతిని మార్చుకోలేరు. మొబైల్స్ ఆఫ్ చెయ్యమని పెద్దవాళ్ళే వాళ్ళకి చెప్పే పద్ధతక్కడ కనిపించటం లేదు. ఈ విధంగా ఒకసారి కాదు రెండుసార్లు కాదు నాలుగైదుసార్లు జరిగింది. పురోహితులకింక విసుగొచ్చేసింది. ఇద్దరూ ఒక వైపుకి జరిగి కూడబలుక్కున్నారు. పిల్లతండ్రిని, పిల్లాడితండ్రిని పిల్చి ఏదో అడిగారు. పెళ్ళి మండపం దిగి, నేనున్న వైపుకొచ్చి నా పక్కనున్న కుర్చీల్లో సెటిలయ్యి ఎదురుగా వున్న పెళ్ళికొడుకు పెళ్ళికూతుళ్ళనే చూస్తూ కూర్చున్నారు.

నాకేమీ అర్థం కాలేదు. చిన్నప్పుడు చదివిన కథలు గుర్తొచ్చేయి. తపస్సు చేసే మునీశ్వరుల్ని నిర్లక్ష్యం చేసిన రాజుల్ని ఆ మునులు శపించినట్టు యిప్పుడీ పురోహితులు ఆ పెళ్ళి చేసుకునే పిల్లల్ని శపించేస్తారేమోనని అనిపించింది. అంతటి తపఃశ్శక్తి వీళ్ళకుండదేమోలే అని నాకు నేనే సమాధానం చెప్పుకున్నాను. కుతూహలం ఆపుకోలేక వాళ్ళనే గమనిస్తూ కూర్చున్నాను.

వధూవరులిద్దరినీ దీక్షగా గమనిస్తున్న పురోహితులిద్దరూ వాళ్ళు మొబైల్‌లో మాట్లాడ్డం ఆపడం చూసి ఒక్కసారిగా అలర్టయ్యేరు. ఇద్దరూ నడుములో దోపుకున్న మొబైల్ ఫోన్లని బైటికి తీసేరు. నంబర్లు నొక్కేరు. మొబైల్ మోగగానే పెళ్ళి మండపంలో కూర్చున్న పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురూ ఆటోమేటిగ్గా వాటిని చెవులకంటించేసుకున్నారు.పురోహితులిద్దరూ నా పక్కనున్న కుర్చీల్లో కూర్చుని సుముహూర్తం మంత్రాలు చదువుతుంటే పెళ్ళిమండపంలోని వధూవరులిద్దరూ మొబైలు ఫోన్లు చెవికంటించేసుకుని వాళ్ళు వీళ్ళు చెప్పినట్టు చేసేస్తున్నారు. ఒకళ్ళ నెత్తిమీదొకళ్ళు జీలకర్రబెల్లం పెట్టేసుకుని సుముహూర్తం కానిచ్చేసారు.

అయమ్ముహూర్త స్సుముహూర్త మస్తునేను 'హమ్మ మొబైలా!' అనుకున్నాను.

✤